క్లుప్తంగా

ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు కర్నూలు ఎన్‌సీసీ అధికారులు రూప్‌సింగ్, షేక్‌షావలీ గురువారం శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి, క్రమశిక్షణ కలిగి జీవించాలన్నారు. దేశ సమైక్యతను చాటి చెప్పేవిధంగా ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారిణి పరిమళ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు



శ్రీనాథ్‌గుప్తాను అభినందిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా)కు ఉత్తమ సేవ సంస్థగా, సంస్థ పట్టణ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా ఉత్తమ సంఘ సేవకర్తగా గత నెలలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్ప్ ఫౌండేషన్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈ మేరకు గురువారం అవార్డుగ్రహీత వంకదారు శ్రీనాథ్‌గుప్తాను సబ్‌కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

సైన్స్‌తోనే సంపూర్ణ పరిజ్ఞానం



మానవ రక్త ప్రసరణ వ్యవస్థను వివరిస్తున్న విద్యార్థులు

కోసిగి: సైన్స్‌తోనే సంపూర్ణ పరిజ్ఞానం పెంపొందించుకోవచ్చని కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్ అన్నారు. గురువారం స్థానిక పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థులు వారి స్థాయి తగ్గట్టుగా నమూనాను తయారు చేసి ప్రదర్శించారు.

బాధ్యతల స్వీకరణ



ఎం.కేశవ, ఎస్ఐ

నందవరం : నందవరం పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఎం.కేశవ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ వి. శ్రీనివాసులును ఉన్నతాధికారులు కర్నూలు డీసీఆర్‌బీకి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నంద్యాల జిల్లా కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి కేశవను నియమించారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

భోజనం నాణ్యతగా లేకపోతే చర్యలు



వంట ఏజెన్సీ నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంఈఓ -2 మధుసూదన్‌రాజు

ఎమ్మిగనూరురూరల్: మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి-2 మధుసూధన్‌రాజు హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని మల్కాపురంలో ఎంపీపీ స్కూల్‌ను సందర్శించి చేసి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. వంటల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని వంట ఏజెన్సీ నిర్వాహకురాలిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం నాణ్యత చూసుకోవాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై ఉందన్నారు.

కొవ్వొత్తులతో క్రైస్తవుల ర్యాలీ



శాంతియుత ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ పరిసర ప్రాంతాల్లోని క్రైస్తవులు గురువారం రాత్రి శాంతియుతంగా ర్యాలీ చేపట్టారు. కొవ్వొత్తులు చేత భూని టూటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి భీమాస్ కూడలి మీదుగా శ్రీనివాసభవన్ సర్కిల్ చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీయూసీఏ ప్రెసిడెంట్ ఆనందరాజు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి ప్రభువు ధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



గంగవరంలో మిర్చి దిగుబడులపై పట్టలు కప్పిన దృశ్యం



గాలికి నేలకొరిగిన మొక్కజొన్న పైరు



గోనెగండ్లలోని గద్వాల వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

అకాల వర్షం..
అన్నదాతకు కష్టం

- వంటను కాపాడుకోవడానికి అవస్థలు
- గాలులకు నేలవాలిన మొక్కజొన్న పైరు
- ఆందోళనలో రైతన్నలు

నందవరం : అకాల వర్షానికి రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో నాగలదిన్నె, పెద్దకొత్తిలి, జోహరాపురం, గంగవరం, రాయచోటి, నందవరం, నదికైరవాడి తదితర గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు ఉరుములు, మెరపులు, గాలులతో కూడిన వర్షం కురిసింది. ప్రస్తుతం రైతులు మొక్కజొన్న, మిరప పంటలను కోత కోసుకుని కళ్లలో ఆర బోసుకున్నారు. అకాల వర్షానికి మొక్కజొన్న గింజలు, ఎండు మిర్చి తడిసిపోకుండా కాపాడుకునేందుకు పట్టలు కప్పుకుంటూ అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. తడిస్తే గింజలు, ఎండు మిర్చి దెబ్బతీంటుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉరుములు, మెరుపులు, గాలులుతో కూడిన వర్షం పడడంతో అక్కడక్కడ మొక్కజొన్న పైరు నేలకొరిగింది.



ఆదోనిలో వర్షం కురుస్తున్న దృశ్యం

గోనెగండ్లలో మోస్తరు వర్షం

గోనెగండ్ల : వాతావరణంలో మార్పుల కారణంగా గురువారం మధ్యాహ్నం గోనెగండ్లలో ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు జోరుగా వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు ప్రవహించాయి. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అలాగే వైఎస్సార్ సర్కిల్‌లో ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన రహదారిపై వర్షాపు నీళ్లు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గంజిహళ్లి రోడ్డు నుంచి మొట్టివీధి తదితర కాలనీల నుంచి వర్షపు నీరు గద్వాల వీధిలో ప్రవహించాయి. అయితే గద్వాల వీధిలో డ్రైన్ చిన్నగా ఉండడంతో ఇళ్ల ముందు వర్షం నీరు చేరాయి. దీంతో ఆ కాలనీలోని ప్రజలు వర్షం వచ్చినప్పుడంతా చాలా ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి కాలనీలో పెద్ద డ్రైనేజీ నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



జొహరాపురంలో మొక్కజొన్న గింజలపై పట్టలు కప్పిన దృశ్యం

ఆదోనిలో వర్షం

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో గురువారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లు, కూడళ్లలో ప్రజలు రోడ్డు పక్కనే కొంతసేపు ఉండిపోయారు.

భూ సమస్యల పరిష్కారమే రీ సర్వే లక్ష్యం

ఆదోని రూరల్: భూ సమస్యల పరిష్కారమే రీ సర్వే లక్ష్యమని తహసీల్దార్ శివరాముడు అన్నారు. మండలంలోని హానవాల్ గ్రామం రీ సర్వే 2వ విడతలో ఎంపికైన సందర్భంగా గురువారం గ్రామంలో రీ సర్వేకు సంబంధించి తహసీల్దార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలకు రీ సర్వే గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో భూ సమస్యలను రీ సర్వే ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. భూ సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రీ సర్వే ఉప తహసీల్దార్ పెద్దయ్య, మండల సర్వేయర్ ఈశ్వర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

రీసర్వే పకడ్బందీగా చేపట్టండి

కోసిగి: రైతుల సమక్షంలో వారి అభిప్రాయం మేరకు భూముల రీసర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం మండలంలోని దుద్ది గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో దుద్ది, కొల్మాన్‌పేట గ్రామ సర్పంచ్‌లు వరలక్ష్మి, గులిగేని జయరామ్‌ల అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ముందుగా గ్రామంలో రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ దుద్ది, కొల్మాన్‌పేట గ్రామంలో 2734.39 ఎకరాలు భూమి విస్తీర్ణం ఉందన్నారు. గ్రామంలో ముందు ఒక రోజు రైతులకు రీసర్వేకు హాజరు కావాలని నోటీసులు అందజేయాలని, వారి సమక్షంలోనే రీ సర్వే చేయించి సంతృప్తి పరిచేలా చూడాలని సూచించారు. కోసిగి మండలంలో 28 గ్రామలు ఉండగా ఇదవరకే 14 గ్రామాల రీసర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద చింతకుంట రీ సర్వే చేయించామని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్ఐ శ్రీరాములు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

అభ్యంతరాలుంటే తెలపండి

కౌతాళం: రీ సర్వేలపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా రైతులు అధికారుల దృష్టికి తీసుకుని రావాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ సూచించారు. మండలంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గుడికంబాలి గ్రామంలో రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్పంచ్ సిద్దేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన రైతులకు నోటిసులను జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే ద్వారా నమోదు చేసిన భూమి విస్తీర్ణంపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే నోటీసు అందిన 21రోజుల లోపు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద అందుబాటులో ఉన్న ఫారంలలో తెలియజేయాలని సూచించారు. తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల సర్వేయర్ బసవరాజు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

మంత్రాలయం : అక్షరాస్యతలో వెనుకబడిన జిల్లా పశ్చిమ ప్రాంతమైన మంత్రాలయం నియోజకవర్గంలో పాఠశాలల బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం మంత్రాలయం మండలం రాంపురం గ్రామంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల విద్యాధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు అనుగుణంగా ఎంత మంది ఉపాధ్యాయులు అవసరం అవుతున్నారో, మౌలిక వసతుల కల్పన వంటి వివిధ అంశాలపై విద్యాశాఖకు అందించిన నివేదికను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా వలసలు వెళ్తున్నారని, వలసలు వెళ్లే వారి పిల్లలకు అవసరమైన చర్యలుపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మంత్రాలయం, కౌతాళం, కోసిగి, పెద్దకడబూరు ఎంఈఓలు రాఘన్న, రామాంజినేయులు, శోభరాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ఆర్థిక సాయం

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు-1కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేవచరణ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్య ఖర్చులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని దేవచరణ్ కుమారుడు వెంకప్పకు గురువారం అందజేశారు. నాయకులు అనిల్‌కుమార్, బారికి చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసి, ఆప్కాస్‌ను కొనసాగించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయూస్ యునియన్ కార్యదర్శి ఇస్మాయిల్, సీఐటీయూ నాయకుడు రాముడు డిమాండ్ చేశారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ చేపట్టిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు కాంట్రాక్ట్ కార్మికులను కూటమి ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చి తొమ్మిదినెలలు గడిచినా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తామని మంత్రి వర్గ తీర్మానం చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో యునియన్ నాయకులు మునీంద్ర, ఖాజ, బాషా, రంగస్వామి, సల్మాన్, దేవమాత, పల్లవి రాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు చేయూతనిస్తాం

ఎమ్మిగనూరుటౌన్: చేనేత కార్మికులకు చేయూనందించే కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన గృహం వద్ద ఫ్యాషన్ డిజైన్లపై చేనేతలకు ప్రముఖ డిజైనర్ చంద్రిక రాముతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె నేత పనిలో డిజైన్లపై నేత కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి నిత్యరెడ్డి, చేనేత జౌళి శాఖ ఏడీ నాగరాజారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించండి

పట్టణంలోని చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వైడబ్ల్యూసీఎస్ చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు శ్రీధర్, రామచంద్ర, కృష్ణ, నాగరాజు, చంద్రశేఖర్, హనుమంతప్ప తదితరులు కోరారు. గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే

నందవరం : భూ సమస్యల పరిష్కరానికి సమగ్ర రీ సర్వే చేపట్టామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో రీ సర్వే డీటీ మహేష్, తహసీల్దార్ చేతు మీదుగా రైతులకు 9(2) నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. నదికైరవాడి గ్రామాన్ని రీ సర్వేలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక కాగా సర్వే పూర్తి చేశామన్నారు. దాదాపు గ్రామంలో 3,000 ఎకరాలు రీ సర్వే చేసినట్లు వివరించారు. 300 మందికి నోటీసులు అందించామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అక్బర్‌బాషా, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



నదికైరవాడిలో రైతుకు నోటీసు అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోండి

మంత్రాలయం : మండలంలోని చిలకలడోణ గ్రామంలో ఇనామ్ భూములు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు గుండుపోగు నేపాల్ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సర్వే నెంబర్ 62లో లక్ష్మమ్మవ్వ, ఆంజనేయ స్వామికి చెందిన భూములలో ఓ వ్యక్తి కబ్జాకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేశారు. కొందరు అధికారులు అక్రమార్కుల దగ్గర ముడుపులు తీసుకుని నకిలీ మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ సర్టిఫికెట్స్ పెట్టి ఇనామ్ భూములను వారి చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ చేసి ఇనామ్ భూములు ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలని కోరారు. సంఘం నాయకులు ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీ నియామకం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు పట్టణ కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పట్టణ అధ్యక్షుడిగా కామర్తి నాగేషప్పను నియమించగా ఉపాధ్యక్షులుగా బీఎస్ బజారిరెడ్డి, ఉప్పర నరసింహ, ప్రధాన కార్యదర్శులుగా కరె రాము, ఉప్పర ఉరవకొండ నాగేష్, కె.విశ్వనాథ్, బోయ అంజినయ్య, కార్యదర్శులుగా ముల్లా రసూల్, జేరుబండి రఘువీర, కటికె మాబ్బాషా, వడ్డే నాగరాజు, బి.మద్దిలేటి, కోశాధికారిగా తారా రాజశేఖర్‌లతో పాటు పలువురు ఎక్జిక్యూటీవ్ మెంబర్లను నియమించారు.

ఎస్సీల భూములకు రస్తా చూపండి

ఎమ్మిగనూరుటౌన్: పార్లపల్లి గ్రామంలో దళితులకు చెందిన భూములకు హద్దులు, రస్తాలు చూపాలని ప్రజా సంఘాల నాయకులు రామతీర్థం, మాల నరసన్న, సుమాల చార్లెస్, ప్రసన్న కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి ఎంపిక

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో నాల్గవ సంవత్సరం బి.టెక్ సీఏఐ చదువుతున్న విద్యార్థిని సాయిమేఘన ఇన్ఫోసిస్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాలలో విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు ప్లేస్‌మెంట్ అధికారి రాజేంద్రప్రసాద్, సీఏఐ విభాగపతి డా. నరసింహారెడ్డి, నందకిషోర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్‌లో సంవత్సరానికి రూ. 6 లక్షల ప్యాకేజీలో ఉద్యోగం సంపాదించడం చాల సంతోషంగా ఉందని చెప్పారు.

15వ ఆర్థిక సంఘం నిధులకు అర్హత



ఎం.కృష్ణ, మున్సిపల్ కమిషనర్

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగానూ ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని అధికమించి 15వ ఆర్థిక సంఘం నిధులకు అర్హత సాధించామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.11.73 కోట్లు వసూలు చేశామన్నారు. పరిశ్రమలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే వసూలు చేస్తామన్నారు. 62 శాతం మేర పన్నులు వసూలు చేశామని, దీంతో ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన 15వ ఆర్థిక సంఘం నిధుల మంజూరుకు అర్హత సాధించామని చెప్పారు. మార్చి ఆఖరిలోగా 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ప్రభుత్వం రూ.2.46 కోట్లు టార్గెట్ విధించగా.. రూ.3.96 కోట్లు వసూలు చేసి అర్హత సాధించామని చెప్పారు. దీంతో త్వరలోనే రూ.13 కోట్ల మేర విడుదల కానున్నాయని తెలిపారు.

16న అవిశ్వాస తీర్మానం

ఈనెల 16వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతపై వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు అవిశ్వాస తీర్మానం(బలపరీక్ష) పెట్టారని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. స్పెషల్ ఆఫీసర్‌గా సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాలకవర్గ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యం కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: ఆర్టీసీలో పాత పద్ధతిలోనే ఉద్యోగులకు వైద్య సౌకర్యం అందించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ఎం రఫీక్, ముస్తాక్ అహమ్మద్ డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని ఆర్టీసీ డిపో గేట్ ఎదుట ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డులకు బదులుగా పాత పద్ధతిలో సీలింగ్‌లేని వైద్య సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్ఆర్‌బీఎస్ సంక్షేమ పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్‌పీఎం సాహెబ్, బజారప్ప, సురేష్ బాబు, భాస్కర్‌రావు, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ డిపో గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పన్ను వసూళ్లలో ప్రథమం

- 75 శాతం పన్నులు వసూలు చేసిన ఎమ్మిగనూరు మున్సిపాలిటీ
- నీటి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో 9వ స్థానం



ఎమ్మిగనూరుటౌన్: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆస్తి, నీటి పన్ను వసూళ్లలో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను గత నెలాఖరు నాటికి రూ.8.55కోట్ల మేర పన్ను వసూలు అయ్యాయి. దీంతో జిల్లాలో 75 శాతం పన్ను వసూలు చేసింది.

పట్టణంలో 24,006 అసెస్‌మెంట్లు

పట్టణంలో 34 మున్సిపల్ వార్డులున్న పట్టణంలో 24,006 అసెస్‌మెంట్‌లుండగా వాటిలో ఆస్తి పన్ను రూ.6.05కోట్ల మేర పన్ను వసూలు కాగా, నీటి పన్ను రూ.2.50కోట్ల మేర వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది వసూలు చేశారు. దీంతో నీటి పన్ను వసూళ్లలో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది .ఇంకా ఆస్తి పన్నులో ప్రభుత్వ సంస్థల నుంచి దాదాపు రూ.2.50కోట్ల మేర మున్సిపాలిటీకి రావాల్సి వుంది. ఇందులో ఆరియర్స్ రూ.1.40కోట్లు వసూలు కావాల్సి వుంది. 26 వార్డు సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పన్ను వసూళ్లకు శ్రమించడంతో పన్ను వసూళ్లలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు.

సమిష్టి కృషితో పన్నుల వసూళ్లు



మున్సిపల్ రెవెన్యూ, వార్డు సచివాలయ సిబ్బంది సమష్టి కృషితో పన్నులు వసూలు చేయడం జరిగింది. పన్ను వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు వడ్డీపై రాయితీ ఇవ్వడంతో అనుకున్న మేర స్పందన వచ్చింది. మున్సిపాలిటీ పరిధిలో 75 శాతం మేర పన్నులు వసూలు కావడం జరిగింది.

– గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

ప్రభుత్వ సంస్థలు చెల్లిస్తే వందశాతం అయ్యేది



మున్సిపాలిటీలో అనుకున్న మేర పన్నులను సిబ్బంది సహకారంతో పన్నులు వసూలు చేయడం జరిగింది. ఇంకా ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు వసూలు అయివుంటే వంద శాతం పన్ను వసూలు అయినట్లు వుండేది. పన్ను వసూళ్లలో సిబ్బంది బాగా పనిచేశారు.

– అస్లాంబాష, మున్సిపల్ ఆర్ఓ, ఎమ్మిగనూరు

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధం



కోసిగిలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

కోసిగి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని వైఎస్సార్‌సీపీ మంత్రాలయం నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షంషుద్దీన్, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రహీమ్, నాయకులు నూర్ అహ్మద్, సోఫిరజాక్, ఇక్బాల్ ఆరోపించారు. గురువారం కోసిగిలో ముస్లిం మైనార్టీ నాయకులు కేంద్ర కమిటీ ఆమోదించిన వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును కేంద్రం చట్టవిరుద్ధంగా అమలు చేస్తున్నా రాష్ట్రంలోని కూటమి నాయకులు మద్దతు తెలుపడం దారుణంగా ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బిల్లును పూర్తిగా వ్యతిరేకించిందన్నారు. నాయకులు షేక్ అహ్మద్, నన్నేసాబ్, ఖాదర్, షాకీర్, హాజీ, అన్వర్, షేక్షావలి, అబ్దుల్ హమీద్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.